# మీరేమంటారు?

- పి.వి.ఆర్. శివకుమార్

పిడుగు మీద పడినట్టు చలించాడు ఒక్కసారిగా రఘురాం - పేపర్ చూస్తూనే.

"లీలా..." అంటూ కేక పెట్టాడు.

"ఏమిటండీ?" అంటూ గబగబా వచ్చింది లీల. "ఏమయిందే?"

"పేపర్లో హెడ్‌లైన్స్ చూశావా?" కంగారుగా అన్నాడు.

"లేదే? నేను వంటింట్లోనే ఉన్నాను. పేపర్‌వాడు పడేసి వెళ్ళినట్టు కూడా నాకు తెలీదు. ఏం, ఏమైంది?"

"ఘోరం జరిగిపోయింది బెజవాడలో. చూడిదిగో. ఎమ్.ఎల్.ఏ.ని హత్య చేశారుట నిన్న పొద్దున. దాంతో చాలా గొడవలు చెలరేగాయిట. బెజవాడలో, ఆ చుట్టుపక్కల చాలా ఊళ్ళల్లో రౌడీమూకలు చెలరేగి, ఇళ్ళని ధ్వంసం చేస్తున్నార్ట - తగలబెడుతున్నార్ట. ఆస్తుల్ని దోచుకుంటున్నార్ట... పాతిక ఊళ్ళలో కర్ఫ్యూట."

"ఆc. అమ్మయ్యో ! అదేమిటండీ?" గాభరాగా పేపర్లోకి తొంగి చూసింది లీల కూడా.

ఇద్దరూ కలిసి మొదటి పేజీ అంత రెండు నిమిషాల్లో చదివేశారు.

"మనకి టీ.వీ. ఉంటే రాత్రే తెలిసేది వార్తల్లో..." అంది లీల - "ఎలా ఉన్నారో మామయ్యా, అత్తయ్యా వాళ్ళు?"

"గొడవలు జరుగుతున్నది కూడా నాన్నా వాళ్ళున్న చోట్లలోనే ! ఉండు నేను పక్క వాళ్ళింటికి వెళ్ళి ట్రంక్ కాల్ చేసి వస్తాను" అంటూ లేచాడు రఘురాం.

లీల కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"వర్రీ కాబోకు. మన వాళ్ళ కేం కాదులే !" తేలిపోతున్న గొంతుతో అనేసి పక్కింటి వైపు నడిచాడు రఘురాం.

ఇంట్లో పనులు కూడా మరిచిపోయి, గుమ్మంలోనే నిల్చుండిపోయింది లీల.

అరగంట గడిచినా భర్త రాకపోవటంతో, లోపల మంచంమీద నిద్రపోతున్న కొడుకుని ఓసారి చూసి, తలుపు దగ్గరగా లాగి గడియ పెట్టి తనూ వెళ్ళింది పక్కింటికి.

"లైన్స్ దొరకటం లేదుట. అర్జెంట్ కాల్ బుక్ చేసినా..." చెప్పాడు రఘురాం భార్యని చూసి - "నేను వెయిట్ చేస్తాను. ను వ్వెళ్ళు. బాబు లేస్తాడేమో !"

"మీ వాళ్ళకేం పర్లేదులే లీలా ! మీ వాళ్ళున్న లోకాలిటీ చాలా పెద్ద వాళ్ళుండే ఏరియాట కదా !" ఓదార్పుగా అంది పక్క ఇంటి శారద.

"ఏమో శారదా, నాకు చాలా భయంగా ఉంది. పేపర్లో రాసిన వార్తలు చూస్తుంటే కంగారు పుడుతోంది."

"రాత్రి మేం ఫస్ట్ షోకి వెళ్ళాం. లేకపోతే, టీ.వీ.లో నన్నా తెలిస్తే మీకు చెప్పేదాన్ని. రాత్రే ఫోన్ చేసేవాళ్ళం" అంది శారద.

లీల నెమ్మదిగా వెనక్కి తిరిగి తమ ఇంటికి నడిచింది.

మరో అరగంటయ్యాక, ముఖం వేలాడేసుకుని వచ్చాడు రఘురాం.

"ఏమండీ లైన్ దొరికిందా?" ఆత్రంగా అడిగిన లీలతో నెమ్మదిగా చెప్పాడు - "లేదు ! లైన్ కట్ అయిపోయిందిట - ఫోన్ పని చెయ్యటం లేదుట."

"ఎవరిదండీ?" ఏడుపు గొంతుతో అడిగింది లీల.

"మా నాన్నగారి పక్కింట్లో ఉండే అనంతరావుగారిది."

"మై గాడ్ ! అంటే... వాళ్ళ ఫోన్ ఎవరో అల్లరిమూకలే కట్ చేశారంటారా? అంటే గొడవలు అక్కడ కూడా... వాళ్ళ ఇల్లు కూడా..." మధ్యలోనే ఆగిపోయిం దామె.

"ఏం చెప్పగలం? అలా కాకపోనూవచ్చు. అల్లర్లకి ఊళ్ళో టెలిఫోన్ స్తంభాలు కూడా పడిపోయి ఉండవచ్చు."

"ఏం చెయ్యటమండీ. ఇప్పుడు? ఎలా తెలుస్తుంది మనకి వివరం?" దాదాపుగా ఏడ్చేసింది లీల.

"లీలా... లీలా ! ను వ్వలా ఏడ్చెయ్యకు. నా బుర్ర అసలు పని చెయ్యదు. ఆలోచిద్దాం. ఏదో ఒక మార్గం. నేను టెలిగ్రాం ఇచ్చి వస్తాను ముందు - మన వాళ్ళ క్షేమాలు తెలియజెయ్యమని."

"మీరు వెంటనే బెజవాడ వెళ్ళి రండీ... అహc... మనం బెజవాడ వెళ్ళి వద్దామండీ ! టెలిగ్రాము వాళ్ళకి అంది, జవాబు వచ్చేదాకా ఎలా ఎదురుచూడటం?"

"రాష్ట్రం కాని రాష్ట్రం. వెయ్యి మైళ్ళ దూరం. అంత వెంటనే వెళ్ళగలమా? వెళ్ళటానికైనా రెండ్రోజులు పడుతుంది. ఆలోచిద్దాం. అంతకన్నా ముందు టెలిగ్రాం ఇద్దాం. నేను ఆఫీసుకి వెళ్ళి బెజవాళ్ళో ఇంకా తెలిసిన వాళ్ళెవరికైనా ఫోన్ ప్రయత్నం చేస్తాను. సాయంత్రానికి ఎటూ తెలీకపోతే చూద్దాం. నువ్వు అధైర్యపడకు."

మనసులోని భయాన్ని తొక్కిపట్టి, భార్యకి ధైర్యాన్ని నూరిపోశాడు రఘురాం.

అన్యమనస్కంగానే పనులు ముగించుకుని ఆఫీసుకి బయలుదేరాడు.

అతను పని చేస్తున్న కంపెనీ హెడ్డాఫీస్ హైదరాబాద్ కావటాన, అతనున్న బ్రాంచ్‌లో చాలామంది తెలుగువాళ్ళున్నారు - ఆఫీసులోనూ అంత గొడవగా ఉంది.

"ఒక్క బెజవాడే కాదు గురూ. ఆంధ్రా జిల్లాలన్నిటిలోనూ గొడవలు జరుగుతున్నాయిట ! నేను ఎస్.టి.డి.లో మాట్లాడాను హైదరాబాద్‌కి..." అన్నాడొకతను.


"మనం వెళ్ళి వస్తేనో?" అన్నాడు మరొకతను.

"ఎక్కడికి? ఇంపాజిబుల్. హైదరాబాద్ నుంచి రైళ్ళూ, బస్సులూ కూడా నడవట్లేదుట అటువైపు ! తీరా వెళ్ళి హైదరాబాద్‌లో చిక్కుకుపోతావ్ !" ఇంకొకతను అన్నాడు.

హతాశులై కూర్చున్నారు అందరూ.

** ** **

టెలిగ్రాంకీ, ట్రంక్ కాల్స్‌కీ వివరాలు తెలీకపోయినా, వార్తాపత్రికల పుణ్యమా అని మూడో రోజు ఉదయం అన్ని వార్తలూ తెలిశాయి రఘురాంకి - అన్ని దుర్వార్తలూ ! పేర్లతో సహా సంఘటనలు రాశారు పేపర్లో !



అనంతరావుగారి భవనం పూర్తిగా దగ్ధం చేసేశారు. సామానంత నిలువుదోపిడీ అయిపోయింది. ప్రాణభయంతో పారిపోయి, భార్యా కూతుళ్ళతో పక్కింట్లో తలదాచుకోబోయాడు ఆయన. ఆయన్ని లోపల దాచిన నేరానికి సుబ్బయ్యగారి డాబా ఇంటిని కూడా తలుపులు పగలగొట్టి, సామానంత దోచేశారు దుండగులు. పక్కింటి భుగభుగల్లో సుబ్బయ్యగారి ఇల్లు కూడా నగం కాలిపోయింది.

వార్త చదువుతూనే నిలువునా కూలిపోయాడు రఘురాం. బావురుమంధి లీల.

విషయం తెలిసిన ఇరుగూ పొరుగూ ఓదార్చారు వాళ్ళని - "ఆస్తి ఏమైపోయినా మనుషులకేం కాలేదు. అందుకు సంతోషించాలి మీరు. వెంటనే బయలుదేరి వెళ్ళి క్షేమం చూసి రండి. లేదా, నాల్రోజుల పాటు ఇక్కడికి తీసుకొచ్చెయ్యండి" అంటూ సలహా ఇచ్చారు.

రఘురాం ఒక్కడే ప్రయాణమయ్యాడు - "బస్సులూ, రైళ్ళూ నడవకపోతే నువ్వూ, బాబూ కూడా ఉంటే మరీ చిక్కుల్లో పడతాం. నేను వెళ్ళి వస్తా" అన్నాడు. చేసేదిలేక తలూపింది లీల.

ఇబ్బందులు పడుతూ రెండు రోజులకి ఇల్లు చేరిన కొడుకుని కన్నీళ్ళతో ఆహ్వానించింది సుబ్బయ్యగారి భార్య.

"ఏడవకే ! ఎప్పుడేం జరగాలో అది జరుగుతుంది ! పాపం, నానా ఇబ్బందీ పడి వచ్చాడు - వాడిని హడలెత్తించకు" అన్నాడు సుబ్బయ్య.

"వార్తలు తెలిసినప్పట్నించీ మిమ్మల్ని కాంటాక్ట్ చెయ్యటానికి చెయ్యని ప్రయత్నం లేదు నాన్నా ! కర్మకొద్దీ ఏ ప్రయత్నమూ ఫలించలేదు" అన్నాడు రఘురాం.

"నువ్వేం చేస్తావురా?

మనుషులం మన ప్రయత్నాలు ఏం ఫలిస్తాయ్?" కొడుకు భుజంమీద చెయ్యి వేసి అన్నాడు సుబ్బయ్య.

తల్లిదండ్రుల్ని క్షేమంగా చూశాక మనసు కుదుటపడిం దతనికి.

వాళ్ళ ఇల్లు అంతగా దెబ్బ తినలేదు. ఒకవైపు కాంపౌండ్ గోడ కాలిపోయింది. ఆవైపు నున్న రెండు గదులూ, గోడలు కొంత దెబ్బతిన్నాయి. ఇంట్లో ఉన్న ఫర్నిచర్, బంగారం, కొన్ని బట్టలూ దోపిడీదారుల పరం అయ్యాయి !

"మళ్ళా ఈ జన్మకి కొనుక్కోలేం. ఇల్లు బాగుచేయించేటందుకే అవుతాయి వేలు !" గుడ్లనీరు కుక్కుకుంటూ అందతని తల్లి.

"పోనియ్యవే ! మన అదృష్టం ఇంతవరకే. పెద్ద గీతని చూసి చిన్న గీత సంతోషించాలి. అనంతరావుగారి సంగతేమిటి? కోటీశ్వరు డాయన. ఇవాళ ఎలా ఉంది పరిస్థితి? పాతిక లక్షల భవంతి పాడుబడిపోయింది. పోయిన ఆస్తికి లెక్కలేదు. నడివీధిన పడినట్లయింది సంసారం. మనకి అందుతో పోలిస్తే ఏం నష్టం జరిగిందని?" అన్నాడు సుబ్బయ్య.

"అసలు, వాళ్ళని ఆదుకోబోతేనటగా మనింటిమీద పడింది " అడిగాడు రఘురాం.

"అవన్నీ ఉత్తిమాటల్రా ! దోపిడీ మూకలకి విచక్షణ ఏమిటీ? ఆ ఇల్లు అయినాక మ నిల్లు ! అంతే... ఈలోగా ఆయన కుటుంబం రావటం, మనం లోపలకి రానియ్యటం జరిగాయి. అలా జరక్కపోయినా - మనింటిమీద పడేవాళ్ళే !" అన్నాడు సుబ్బయ్య.

"మనం మా ఊరు వెళ్ళిపోదాం నాన్నా ! ఓ నెలన్నా అక్కడుండి, మళ్ళా ఇక్కడ కుదుటపడ్డాక రావచ్చు."

నిర్వేదంగా నవ్వా డాయన. "అంత జరిగేక ఇంకా భయం దేనికిరా నాన్నా ! ఏం పర్వాలేదు. ఎవరి స్థానం ఎక్కడో అక్కడే. పరుగులు పెడితే జాతకాలు మారతాయా?"

గుండెలో ముల్లు దిగినట్లయింది రఘురాంకి. తను అయిదేళ్ళనాడు తండ్రితో మాటా మాటా అని, భార్య చెప్పినట్లే వేరు కాపురం పెట్టటం, వెంటనే వేరే ఉద్యోగానికి ప్రయత్నాలు చేయటం, చివరికి ఎక్కడో ఉత్తర భారతంలో వచ్చిన ఉద్యోగానికి 'ఒక్కడే కొడుకువి - అంత దూరం వెళ్ళకురా' అని మొత్తుకున్న అమ్మ మాటల్ని తోసి రాజని వెళ్ళిపోవటం అన్నీ గుర్తుకి వచ్చాయి.

అందుకే అన్నారా అంత మాట ఇవాళ నాన్నా? ఏమైనా తండ్రి అంత స్థిరంగా చెప్పాడంటే ఇక ఆయన్ని ఒప్పించటం తనతరం కాదని తెలుసతనికి. మౌనంగా ఉండిపోయాడు.

మరో నాలుగు రోజు లుండి, వాళ్ళకి ధైర్యం చెప్పి బయలుదేరాడు. బయలుదేరేముందు అన్నాడు - "ఇల్లు బాగుచేయించటానికీ, ఇంట్లో ఫర్నిచర్ అదీ కొనటానికీ డబ్బేమైనా సర్దమంటావా నాన్నా?"

ఆయన చిన్నగా నవ్వాడు. అదే నవ్వు - రఘురాం గుండెలో ముళ్ళు గుచ్చే నవ్వు.

"ఆ మాట చాలురా. నా తిప్పలేవో నే పడతాను. ఇల్లు బాగుచేయిస్తాలే. ఇక ఫర్నిచరంటావా? ఎవరు కూర్చొను? ఎవరు పడుకోను? ఏదో రెండు కుర్చీలు కొని పడేస్తే కాలం వెళ్ళిపోతుంది ! నువ్వు ఇబ్బందులు పడటం నా కిష్టంలేదు" అన్నాడు.

రఘురాం గొంతులో ఏదో అడ్డుపడ్డట్టయింది. తిరిగొచ్చేశాడు.

** ** **

'ఆంధ్రాలో అల్లర్లలో నష్టపోయిన కుటుంబాల ఉద్యోగులకి స్పెషల్ లోన్‌గా అయిదు వేలిస్తున్నార్ట మేనేజ్‌మెంట్ వాళ్ళు. అయిదేళ్ళ పాటు వాయిదా పద్ధతిలో కట్ చేసుకునే షరతుమీద.'


తిరిగొచ్చిన రోజు తెలిసింది ఈ వార్త రఘురాంకి. ఇంటికి వచ్చి భార్యతో అన్నాడు - "నేనూ అప్లై చేసి తీసుకుందును. నాన్న ఏమీ సాయం అక్కర్లే దన్నారాయె !"


"పోనివ్వండి. అక్కర్లేదన్న వాళ్ళకి మన మేం సాయం చేస్తాం? అదైనా ఊరికే ఇస్తున్నారా? నెలకి సుమారు వంద రూపాయలు కటింగ్ పోయేది." నిష్ఠురంగా అంది లీల.

మనసు చివుక్కుమంది రఘురాంకి ఆ మాటలతో. కానీ ఏమీ అనకుండా ఊరుకున్నాడు.

'కింగ్ సైజ్' అన్న పేరుతో సిగరెట్ల అడ్వర్‌టైజ్‌మెంట్‌లు దర్శనం ఇస్తుంటాయి. మామూలు కంటే పెద్దగా, పొడవుగా ఉండే సిగరెట్లను ఇలా కింగ్ సైజ్ అని వ్యవహరిస్తుంటారు. ఇట్టి ప్రకటనల బోర్డులు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి. అయితే పబ్లిసిటీ కోసం చేసిన ప్రపంచంలో కెల్లా పెద్ద సిగరెట్ పెట్టెను అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఒక వీధి మలుపులో చూడవచ్చు. ఇది మామూలు సిగరెట్ పెట్టె సైజుకి 2,29,436 రెట్లు పెద్దది. అంటే అన్ని సిగరెట్ పెట్టెల్ని ఒకదాని పక్కన ఒకటి ఉంచితే దీని సైజు అవుతుందన్నమాట. దీనికి రంగు వేయడానికి 100 గాలన్లపైగా రంగులు అవసరమయ్యాయట. మరి ఈ బ్రహ్మాండమైన సైజుని ఏమనాలి? 'మోనార్క్ సైజ్' అనాలేమో !

-కె. ఆర్. కె. మోహన్





మాటా మాటా పెరిగితే, మనసుల మధ్య దూరమేగా పెరిగేది !

** ** **

రెండు రోజుల తరువాత ఉదయం ఆఫీసుకి తయారవుతున్న భర్తతో అంది లీల - "ఆ లోన్స్ ఇవ్వటం అయిపోయిందా?"

"లేదు. అప్లికేషన్స్ తీసుకుంటున్నా రంతే. బహుశః ఈ సోమవారంనాడు ఇస్తార్ట డబ్బు. ఏం?"

"ఏం లేదు. నా కో ఆలోచన వచ్చింది. మీరు కూడా అప్లై చెయ్యండి లోన్‌కి."

"నేనా? ఎందుకు?"

"చెప్తానుగా. సాయంత్రం వివరంగా మాట్లాడుకుందాం. మీ రీవేళ అప్లై చెయ్యండి."

"సరే" అన్నా డతను బూట్లు వేసుకుంటూ, తర్కించే తీరుబడి లేక.

ఆఫీసుకి వెళ్ళగానే అప్లికేషన్ తీసుకుని, ఫిలప్ చేసి ఇచ్చాడు. మనసులో మాత్రం ఆలోచనగానే ఉంది.

'ఎందుకు అప్లై చెయ్యమంది లీల? ఆయన వద్దన్నా బలవంతంగా తండ్రికి పంపిచేద్దామన్న ఆలోచన వచ్చిందా ఆమెకి? ఏమో, తండ్రి ఎలా తీసుకుంటాడో? ఆయన వద్దని తిప్పి పంపడు కదా ! సరే కానియ్, చూద్దాం' అనుకున్నాడు.

** ** **

సాయంత్రం అతను ఇంటికి వచ్చేసరికి ఎవరో స్నేహితులు ఉన్నారు. వాళ్ళతో కాలక్షేపం చేసి, వాళ్ళని సాగనంపేక, భోజనాలు చేస్తుండగా చెప్పాడు భార్యతో - "ఇవేళ లోన్‌కి అప్లై చేశాను."

లీల కళ్ళు మెరిశాయి. "మా మంచి శ్రీవారు" అంది.

"సరే సరే... సంగతేమిటో చెప్పు. ఎందుకు అప్లై చెయ్యమన్నావ్?"

ఓ నిమిషం ఆగి, వివరించిం దామె తన ఆలోచన ఏమిటో.

ఉలిక్కిపడ్డాడు రఘురాం.

"ఛ..." అన్నాడు.

"ఏం, తప్పేముంది?"

"తప్పు కాదా?"

"ఏం కాదు. ఆలోచన రాగానే నేనూ అలానే అనుకున్నాను. రెండ్రోజులు ఆలోచించేక నాకేమీ తప్పు అనిపించలేదు మరి."

"నాకు నచ్చలేదు నీ ఆలోచన."

"చెప్పానుగా. మొదట నాకే నచ్చలేదు. మీరూ ఆలోచించండి తీరిగ్గా. ఎలాగూ అప్లై చేశారు కదా ' సోమవారం నాటిక్కదా డబ్బు వచ్చేది. ఇంకా మూడు రోజులుంది అప్పటికి ఆలోచనా తేల్తుంది."

నిర్ణయాన్ని తెలివిగా వాయిదా వేసింది లీల. భర్త విషయం ఆమెకి బాగా తెలుసు.

** ** **

లీల ఊహని నిజం చేశాడు రఘురాం.

మర్నాడు రాత్రి అన్నాడు - "నీ ఆలోచన బానే ఉంది కానీ - నాన్నకి తెలిస్తే?"

"భలేవారే ! ఆయనకి తెలీకుండా ఎలా ఉంటుంది? తెలిసినా మనం మంచి పని చేశామని తెలిస్తే ఆయన సంతోషిస్తారు గానీ ఏమంటారు?"

"ఏమో నాకు అనుమానంగా ఉంది."

"ఊరుకోండి. మీరు మరీ సత్తెకాలం మనిషి." కొట్టిపారేస్తూ అంది లీల.

రాజీ పడిపోయాడు రఘురాం.

** ** **

సోమవారం సాయంత్రం రఘురాం వచ్చేసరికి తయారై కూర్చుంది లీల. అతను కాఫీ తాగి, రిఫ్రెష్ అవగానే ఇద్దరూ బయలుదేరారు.

ఇంటికి తిరిగొచ్చేటప్పుడు ఇద్దరి మధ్యా బాబుతో పాటు ఒదిగి కూర్చుంది ఆ పోర్టబుల్ టీ.వీ.

కొంప కూలిన తల్లిదండ్రులకి సాయం చేస్తామంటూ తీసుకున్న అత్యవసరమైన అప్పుతో - జల్సాగా టీ.వీ. కొనుక్కోవటం తప్పుగా అనిపించలేదు వాళ్ళకి.

"చూశారా - ఈ టీ.వీ. అప్పుడే ఉంటే మనకి ఆ వార్త కూడా ముందే తెలిసుండేది" అంది లీల టీ. వీ. పెట్టుకుని వార్తలు చూస్తూ.

"తెలిసుంటే ఏం చేసేవాళ్ళం? మరి కాస్త ముందే లోన్ కావాలని అడిగుండేవాళ్ళమా?" - అని అడగలేదు రఘురాం. ఎందుకంటే అతనికి అలాటి ప్రశ్న స్ఫురించలేదు గనక !

తప్పు చేసిన భావం అతనికీ కలగలేదు కనక !

నవతరం ఆలోచన తీరు ఇలాగే ఉంటుంది మరి !

మీ రే మంటారు?? ★